ప్రజాశక్తి

సోమవారం 7 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

త్వరలో మార్కాపురం జిల్లా..?

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లా ఏర్పాటుపై కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాతో పాటు మరో మూడు జిల్లాలు అదనంగా పెరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 30కి చేరనున్నాయి.!

మార్కాపురం జిల్లా ఎప్పుడో ఏర్పాటు కావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో జిల్లా సంఖ్య పెరిగినప్పుడు అర్హత కలిగిన మార్కాపురం జిల్లా కేంద్రానికి నోచలేదు. ఈ ప్రాంత ప్రజల్లో మార్కాపురం జిల్లా బలంగా ఉంది.అప్పటి సిఎం జగన్ అదేమీ పట్టించుకోలేదు. వైసిపికి అనుకూలమే అయినా... ఈ ప్రాంతాన్ని జిల్లా చేయకుండా వదిలేశారు. ప్రజల్లో జిల్లా అంశం కూడా తోడై ఇక్కడి ఓటర్లు మెజార్టీగా టిడిపికి పట్టం కట్టారు. సిఎం చంద్రబాబు మాటలను నమ్మారు. టిడిపి అధికారంలోకి రావడంతో నిత్యం జిల్లా ఎప్పుడంటూ అధికార పార్టీ నేతలపై ఇక్కడి ప్రజలు ఒత్తిడి తెస్తున్నారు. అదనపు జిల్లా ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నట్లు సమాచారం. మార్కాపురం జిల్లా ప్రతిపాదన కూడా అందులో ఉందని తెలిసింది.

మార్కాపురం జిల్లాలో కనిగిరి, దర్శి, గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాలు ఉంటాయని తెలిసింది. వచ్చే ఏడాది విజయదశమికి కొత్త జిల్లాలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్కాపురం జిల్లాగా ఏర్పడితే నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రజలకు సైతం దగ్గర అవుతుంది. ఇప్పుడున్న జిల్లా కేంద్రమైన ఒంగోలు 200 కిలో మీటర్ల దూరంలో నల్లమల ఉంది. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం డివిజన్ జిల్లా కేంద్రానికి దూరం కావడంతో పరిపాలన సౌలభ్యంగా ▶ 2లో

మార్కాపురం జిల్లా నమూనా

విమానాశ్రయం కల నెరవేరేనా..?

- ఒంగోలులో ఏర్పాటుపై కేంద్రమంత్రి ప్రకటనతో ఆశలు
- అల్లూరు, ఆలూరు మధ్య ఇటీవల స్థలాన్నిపరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఒంగోలు సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఎప్పటి నుంచో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదన ఉంది. ఇరవై ఏళ్లనుంచి దీనిపై చర్చ సాగుతోంది. వాన్‌పిక్ సంస్థకు భూములు సేకరించిన సమయంలోనూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. అప్పటి నుంచి దీనిపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చాక అప్పటి టిడిపి ప్రభుత్వం కూడా దీనిపై ఆలోచన చేసింది. గత ఐదేళ్లలో దీనిపై చర్చ లేదు. తాజాగా కేంద్రం విమానాశ్రయాల సంఖ్యను పెంచేదిశగా ఆలోచన చేస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో కొన్ని కొత్త ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేయాలనే రాష్ట్రప్రభుత్వ ఆలోచనలకు కేంద్రం కూడా సమ్మతించింది. తాజాగా కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చేసిన ప్రకటన కొత్తగా ఆశలు రేపుతోంది. త్వరలో నెల్లూరు, ఒంగోలు, పుట్టపర్తిలో స్థలాన్ని పరిశీలించి కొత్త ఎయిర్‌పోర్టులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఈ ప్రకటన జిల్లా ప్రజానీకంలో చర్చకు తావిస్తోంది. జిల్లాకు ఎయిర్‌పోర్టు వస్తుందనే భావన పెరిగింది. కూటమి ప్రభుత్వం ఒంగోలులో ఎయిర్‌పోర్టుకు సిద్ధంగా ఉంది. సిఎం చంద్రబాబు కూడా ఒంగోలులో ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు తగ్గట్టుగా కేంద్రమంత్రి కూడా దీన్ని ప్రాధాన్యత అంశాల్లో చేర్చారని తెలుస్తోంది. కొత్తపట్నం మండలం అల్లూరు-ఆలూరు మధ్య 600 ఎకరాలకు పైగా ప్రభుత్వభూమి ఉంది. దీన్ని ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదించారు. ఈ స్థలం అనుకూలంగా ఉంటుందని జిల్లా అధికారులు నివేదించారు. ఇటీవల జిల్లా అధికారులు ఈస్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు సమీపంలో ఎయిర్‌పోర్టు వస్తే మధ్యతరగతి, వ్యాపారులకు ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు. గ్రానైట్ వ్యాపారులకు చెన్నై, హైదరాబాదు, బెంగుళూరు. ఢిల్లీ వంటి ప్రాంతాలకు వెళ్లే అవసరాలున్నాయి. వ్యాపారులే కాకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సంఖ్య పెరిగిగాక వీరు కూడా దేశంలో వివిధ పట్టణాల నుంచి రావాన్నా పోవాలన్నా విమానం ఉంటే బాగుండనే అభిప్రాయంలో ఉన్నారు. చిన్న చిన్న విమానాలు సర్వీసులు అందుబాటు లోకి వచ్చాక ఢిల్లీ, హైదరాబాదు, కాశీ, విశాఖపట్నం, బెంగుళూరు, చెన్నైకు ఎక్కువగా విమానాల్లోనే వెళుతున్నారు. ప్రస్తుతం విజయవాడ లేదా హైదరాబాదు వెళ్లి అక్కడ నుంచి మళ్లీ మరో ▶ 2లో

సాగర్ ఆయకట్టు ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని

చివరి ఎకరాకూ సాగునీరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- సంతమాగులూరు

సాగర్ ఆయకట్టు ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చివరి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండల పరిధిలోని అడవిపాలెం 18/0 వద్ద ఎన్ఎస్‌పి అధికారులతో కలిసి సాగర్ కాలువలో నీటి ప్రవాహాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీరు వథాగా పోకుండా కాలువలో పేరుకు పోయిన చిల్లచెట్టు, పూడికను తీయించాలన్నారు. షట్టర్లకు రిపేర్లు చేయించాలి, షట్టర్లు లేని చోట కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేయించాలన్నారు. కాలువ పరివాహక ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని ఎన్ఎస్‌పి అధికారులను ఆదేశించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ ద్వారా ఎగువ పొలాలకు సైతం నీరు అందించాలన్నారు. పర్చూరు కూడా సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు. పోలిరెడ్డి ఎత్తిపోతల పథకంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వచ్చే ఏడాది కల్లా కొరిశపాడు రిజర్వాయర్‌ను నింపుతామని తెలిపారు. ఆగిపోయిన భవనాసీ రిజర్వాయర్ పనులను రీఎస్టిమేట్ చేసి పున్న ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు విరిగిపోతే గత ప్రభుత్వం మరమ్మతులు కూడా చేయించలేకపోయిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2 గేట్లు మరమ్మతులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు, త్వరలోనే మరమ్మతు పనులు పూర్తి చేసి గుండ్లకమ్మ రిజర్వాయర్ ద్వారా 90 వేల ఎకరాలకు నీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెల్లప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సన్నెబోయిన గురుయాదవ్, మాదాల సుబ్బారావు, ఎంపిపి యలమంద, గాడిపర్తి వెంకటరావు, పసుపులేటి కోటేశ్వరరావు, లక్ష్మయ్య, ధూపాటి ఏసోబు, నక్కా వెంకటేశ్వర్లు, గాలెయ్య, కొనికి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎన్ఎస్‌పి అధికారులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఇసుక కొరత నివారణకు చర్యలు

- 15న ఇసుక రీచ్‌లు ప్రారంభం
- బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలలో నాణ్యమైన ఇసుక లభ్యత ఉందని, ఈనెల 15 నుంచి ఇసుక రీచ్‌లు ప్రారంభించడానికి చర్యలు తీసు కుంటున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి కలెక్టర్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, గాజుల్లంక ఇసుక రేవుల వద్ద 1,48,649 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇసుక రేవులు అందుబాటులోకి వస్తే జిల్లాలో ఇసుక కొరత తీరుతుందన్నారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ (మైన్స్) అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ఉచిత ఇసుక విధానం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 108 ఇసుక రీచ్‌లు ఈనెల 15 నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. జువ్వలపాలెం, గాజుల్లంక రీచ్‌ల్లో సుమారు 1.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవు ఉన్నారు. జిల్లా స్థాయి కమిటీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశం నుంచి ఇసుక తవ్వి ట్రాక్టర్లలో లోడ్ చేసి స్టాక్ యార్డుకు సరఫరా చేస్తారని తెలిపారు. తర్వాత లారీలకు లోడ్ చేయడానికి అవసరమైన ఏజెన్సీలను గుర్తిస్తారని తెలిపారు. ఏజెన్సీల వారు ప్రభుత్వం నిబంధనలకు లోబడి ఇసుకను సరఫరా చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఇసుక కావాల్సిన వారు ఎపి శాండ్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా ఇసుక బుకింగ్ చేసుకొనవచ్చునని తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు ప్రారంభించే వరకూ గుంటూరు జిల్లా నుంచి ఇసుక తెచ్చుకోవచ్చునని తెలిపారు. గుంటూరు జిల్లా తల్లాయిపాలెం నుంచి బాపట్లకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక రూ.12,610 ,పల్నాడు జిల్లా మాదిపాడు నుంచి అద్దంకికి రూ 13,940, గుంటూరు జిల్లా తల్లాయిపాలెం నుంచి రేపల్లేకు రూ.12,260 ఇసుక లభిస్తుందన్నారు. కృష్ణ నది పరివాహక ప్రాంతంలోని ఇసుక లభ్యత ప్రదేశం మరియు రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాలు జరగకుండా చూసేందుకు డ్రోన్ కెమెరాలు , సిసి కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇసుక రవాణా జరిగే ప్రదేశాల కూడలిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ద్వారా ▶ 2లో

విమానాశ్రయం కల నెరవేరేనా..?

(మొదటిపేజీ తరువాయి)

విమానం ఎక్కి వెళ్లాల్సివస్తోంది. అమెరికా,కెనడాల్లో ఉంటే ఎన్ఆర్ఐలు స్వదేశానికి, గ్రామాలకు రావాలన్నా హైదరాబాదు లేదా చెన్నైలో దిగి వస్తున్నారు. అత్యవసర సమయాల్లో అక్కడ దిగి మళ్లీ కార్లు తీసుకుని పరుగులు తీస్తున్నారు.ఇపుడు ఒంగోలులో ఎయిర్‌పోర్టు వస్తే ఈ తరహా ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు. టిక్కెట్ల ధరలు కూడా అందుబాటులో ఉన్నందున రైలు కన్నా విమానం మేలు అనే భావనలోకి వచ్చారు. సమయం చాలా కీలకంగా మారింది. ఇపుడు విజయవాడ నుంచి ఢిల్లీకి వెళ్లే విమానాలు కూడా ఖాళీలు ఉండటం లేదంటున్నారు. కాశీకి కూడా ఎక్కువ మంది విమానాల్లోనే వెళ్తున్నారు. ఒంగోలులో ఎయిర్‌పోర్టు అనగానే ఈ తరహా ప్రజానీకంలో ఆశలు పెరిగాయి. ఎయిర్‌పోర్టు ఏర్పాటును స్వాగతిస్తున్నారు. ఏళ్ల తరబడి ఊరిస్తున్న న్న ఎయిర్‌పోర్టు కోసం జిల్లా ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాలి.

త్వరలో మార్కాపురం జిల్లా..?

(మొదటిపేజీ తరువాయి)

లేదు. జిల్లా స్థాయి అధికారులు చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారు. ఈ ప్రాంతం ఒంగోలుకు దూరం కావడమే అందుకు కారణం. జిల్లా స్థాయి అధికారులకు ఇక్కడ ఏమి జరుగుతోందో పూర్తిగా తెలియడం లేదు. స్థానికంగా అధికారులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచడం లేదు. మార్కాపురం జిల్లాగా ఏర్పడితే పశ్చిమ ప్రకాశంలోని నియోజకవర్గాలకు ఎటు చూసినా 60 కిలో మీటర్ల దూరం మించదు. జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉన్నందున క్రింది స్థాయి అధికారులు సైతం ప్రజలతో సఖ్యతగా నడుచుకునే అవకాశం ఉంటుంది. ప్రజల పనులు కూడా సకాలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో చకచకా జరిగే అవకాశం ఉంటుంది.

ఇసుక కొరత నివారణకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చేసి జిల్లాలో ఇసుక తవ్వకం జరిగే ప్రదేశాలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. ఇసుకకు సంబంధించిన అన్ని వివరాలు, ఫిర్యాదుల నమోదు కోసం డిస్ట్రిక్ట్ శాండ్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9985479797, 8801886606, 8497975823 సెల్‌నంబర్ల ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చుని తెలిపారు. రాష్ట్ర స్థాయి టోల్-ఫ్రీ నంబర్ 1800-599-4599 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్‌పి టిపి. విఠలేశ్వర్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలతో వెలుగులు

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దొనకొండ

గ్రామాల్లోని ప్రతి పేద కుటుంబంలో వెలుగులు నింపేందుకు ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తామని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్‌సిఎం పాఠశాల ఆవరణలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన శంకర కంటి వైద్యశాల సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు తాము కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రజల ఆరోగ్యం నిమిత్తం ఇటీవల దర్శి, నేడు దొనకొండలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యకరమైన సేవలందిస్తున్నామన్నారు. అదేవిధంగా దర్శిలో జాబ్ మేళా ఏర్పాటు చేసి 587 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్లు వైద్య పరీక్షలు పరిశీలించి పలు సూచనలు అందించారు. వైద్య శిబిరంలో మొత్తం 189 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 60 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిలో సోమవారం 10 మందిని, మంగళవారం 50 మందిని తీసుకెళ్లి కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. వైద్య బృందం డాక్టర్ జాగృతి, డాక్టర్ వందన, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ లలిత్‌సాగర్, మండల టీడీపీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కనకదుర్గ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

దేవీ నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మ గుడిలో ఆదివారం లలిత త్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గామాత భక్తులకు దర్శనమివ్వగా ఈ సందర్భంగా పెద్దఎత్తున మహిళలు పాల్గొని ఆలయంలో బోనాలు సమర్పించారు. అదేవిధంగా ఆదినారాయణ, కోటిరెడ్డి, హనుమంతరావు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మారం శివకోటిరెడ్డి, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దర్శిలోని కనకదుర్గమ్మ గుడిలోకి బోనాలతో వచ్చిన మహిళలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టైర్ల షాపు దగ్ధం

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టైర్ల షాపు దగ్ధమైంది. ఈ షాపులో ద్విచక్ర వాహనాల టైర్లు, ట్యూబులు పంచర్లు వేసే యంత్రాలు దగ్ధమయ్యాయి. వీటి విలువ దాదాపు రెండు లక్షల పైగా ఉంటుందని షాపు యజమాని తెలిపారు. ఈ షాపు పక్కనే టీ హొటల్ ఉండగా అక్కడ ఉన్న గ్యాస్ సిలిండర్‌లకు మంటలు అంటుకోకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు.

దర్శి అద్దంకి రోడ్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా ఉత్సవాల్లో పూజలు నిర్వహించిన దర్శి ఎంఎల్‌ఏ, డాక్టర్ బూచేపల్లి - ప్రజాశక్తి-దర్శి

వేలం ప్రకటన

మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP.No.10 of 2022
OS.No. 207 of 2020

బిట్వీన్:-
నక్కల వెంకటేశ్వరరావు ....D.H.R
V/s
కొల్లూరి మాణిక్యరావు ......J.D.R

పై నంబరు E.P లో D.H.R కు రావలసిన డిక్రీబాకీ వసూలు నిమిత్తం J.D.R కు చెందిన దిగువ షెడ్యూలు దాఖలా : E.P షెడ్యూల్ లోని 2 మరియు 3 అయిటంల ఆస్తులను పైకోర్టు వారి ఎదుట ది: 17-10-2024వ తేదీఉదయం 10-30 నిమిషముల నుండి బహిరంగ వేలం నిర్వహించ బడును.కావున యావన్మంది సదరు వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియపరచడమైనది.

షెడ్యూలు :

2వ అయిటం : బాపట్ల జిల్లా, పాత ప్రకాశం జిల్లా, చీరాల స.రి, చీరాల మండలం లోని పిట్టువారి పాలెం గ్రామ పంచాయితీ, ఈపురుపాలెం గ్రామ S.NO. 385/5 లోని య. 4-02 సెంట్ల లోని య.0-65 సెంట్ల మెట్ట భూమికి హద్దులు:
తూర్పు :కొమ్మనబోయిన నాగరాజు వగైరాల భూమి.
దక్షిణం :చప్పిడి రాజు వగైరాల భూమి.
పడమర : కొల్లూరి మాణిక్యరావు గారి భూమి (J.D.R భూమి)
ఉత్తరం : మురుగు కాలువ.
D.H.R విలువ రూ.1,50,000/-
అమీనా గారి విలువ రూ. 22,00,000/-
మార్కెట్ విలువ రూ, 4,55,000/-

3వ అయిటం : బాపట్ల జిల్లా, పాత ప్రకాశం జిల్లా, చీరాల స.రి చీరాల మండలంలోని పిట్టువారి పాలెం గ్రామపంచాయతీ ఈపురుపాలెం గ్రామం S.No. 385/5 లోని య.4.02 సెంట్లలోని యా 0-25 సెంట్ల మెట్ట భూమికి హద్దులు:
తూర్పు : కూర్మాల రామచంద్రరావు గారి భూమి.
దక్షిణం : కొల్లూరి మణిక్యరావు గారి భూమి (J.D.R భూమి)
పడమర : కొల్లూరి మాణిక్యరావు భూమి (J.D.R భూమి)
ఉత్తరం: మురుగు కాలువ.
D.H.R విలువ రూ ,1,00,000/-
అమీనా గారి విలువ రూ, 11,00,000/-
మార్కెట్ విలువ రు, 1,75,000/-

NOTE : J.D.Rచే చీరాల AXIS బ్యాంకు వారికి ది 16-1-2014న ద నెం:186/2014 చీరాల సరి వారి ద్వారా పెట్టిన తనఖా బాకీకి లోబడి పాట నిర్వహించబడును

వేలం వాయిదా : 17-10-2024
ఫర్దర్ హియరింగ్ : 24-10-2024

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పుల్లెల హరిబాబు బి.ఎ., ఎల్ ఎల్.బి.,
అడ్వకేటు కొత్తపేట, చీరాల -523 157.
సెల్ : 9948320308

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 123/2024

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు
జవహర్‌నగర్ బ్రాంచి, మార్కాపురం
రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్, మార్కాపురం
.... వాది

వర్సెస్

డి-1). చీతిరాల చంద్రిక, భర్త: లక్ష్మినారాయణ
ఇంటి నెం: 10-488, మార్కాపురం
డి2. కండె చిన్న మునీశ్వరయ్య, తండ్రి: నాగిశెట్టి
ఇంటి నెం: 10-557, 10వ వార్డు, మార్కాపురం
..... ప్రతివాదులు

టు,
చీతిరాల చంద్రిక, భర్త: లక్ష్మినారాయణ
ఇంటి నెం: 10-488, మార్కాపురం
కండె చిన్న మునీశ్వరయ్య, తండ్రి: నాగిశెట్టి
ఇంటి నెం: 10-557, 10వ వార్డు, మార్కాపురం, ప్రకాశం జిల్లా.

ఈ నెంబరు వాది దావా ప్లైయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసినందున సదరు దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనుటకు 16-10-2024వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 16-10-2024

వై.వెంకటేశ్వరరెడ్డి
అడ్వకేట్, మార్కాపురం.

In The Court of The Prl. District Judge, Ananthapuramu

T.R.O.P.No:07/2024

Between:
Smt.D.C.Nirmala ...Petitioner
And
D.Manikya Rao ...Respondant

Notice to Respondant

To,
D.Manikya Rao S/o D.E.Fedrik #2, Bearpet, Ramakrishnapuram, Chirala Post, Prakasam Dist.

పై నెంబరు కేసులో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 14/10/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

P.KRISHNA SWAMY KUMAR,
Advocate, Ananthapuram.

పేపర్ పబ్లికేషన్

నెల్లూరు జిల్లా, నెల్లూరు టౌను, కుసుమ హరిజనవాడ, డోరు నెం. 1-2-64 నివాసి సోమిశెట్టి లక్ష్మి భారతి భర్త వెంకట రవి కుమార్ మా క్లయింటు యిచ్చిన సమాచారం మేరకు సవరణ దస్తావేజు నెం. 6425/2024న సి.ఎ.యస్ నెం. 150/5 రు, వార్డు నెం.1, యల్.పి నెం. 57/61 డోరు నెం. 737 రు, అసెస్‌మెంట్ నెం.1031000994రు గల 12 అంకణాల ఆర్.సి.సి మిద్దె యిల్లు తూర్పున కాపులూరి ఈశ్వరమ్మ వగైరాలు, దక్షిణం. మెయిన్ రోడ్డు, పడమర. జొన్నవాడ రమణమ్మ గారి స్థలం, ఉత్తరం. ఏటూరి రవణా రెడ్డి గారి స్థలం హద్దులుగా కలవు ఈ షెడ్యూలు ఆస్తికి బ్యాంకులో లోను అప్లై చేసిఉన్నారు. ఎవరైన ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ క్రింది అడ్రసుకు 7 రోజులలోపు తెలపవలసినదిగా కోరుచున్నాము.

ఇట్లు
యమ్. క్రిష్ణారావు
అడ్వకేట్, ఒంగోలు
సెల్ నెంబర్:9848688079

పేపర్ పబ్లికేషన్

నెల్లూరు జిల్లా, నెల్లూరు టౌను, కుసుమ హరిజనవాడ, డోరు నెం. 1-2-64 నివాసి సోమిశెట్టి సీతయ్య, తండ్రి కామయ్య మా క్లయింటు యిచ్చిన సమాచారం మేరకు తేది. 02-10-2024 న మా క్లయింటు మరియు మా క్లయింటు కోడలు అయిన సోమిశెట్టి లక్ష్మి భారతి నెల్లూరు నుండి ఒంగోలుకు పని మీద బస్సులో వచ్చి ఆటోలో కోర్టు సెంటర్ నుండి హెడ్ పోస్టాఫీసు దగ్గరకు వచ్చి దిగి చూసుకొనగా బ్యాగు కనపడలేదు అందులో రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.489/1991 మరియు 1198/1982ర్లు గల ఒరిజనల్ డాక్యుమెంట్లు ఉన్నవి. దాని గురించి ఎంత వెతికిననూ దొరకలేదు. బ్యాగు మరియు బ్యాగులో ఉన్న డాక్యుమెంట్లు దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలుపగలరు.

ఇట్లు
యమ్. క్రిష్ణారావు
అడ్వకేట్, ఒంగోలు
సెల్ నెంబర్:9848688079

మాజీ సర్పంచిపై ఇనుప రాడ్లతో దాడి

తలకు తీవ్ర గాయాలు

గాయాలపాలైన ఓంకార్

పజాశక్తి - పొదిలి

మండలంలోని మాదాలవారిపాలెం మాజీ సర్పంచ్ పెమ్మని ఓంకార్ యాదవ్‌పై శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసినట్టు ఎస్సై వి.వేమన తెలిపారు. ఓంకార్ పొదిలి పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న మధురానగర్‌లో తన ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఇనుప రాడ్లుతో తల మీద దాడి చేశారు. ఇనుపురాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఓంకార్ తలకు బలమైన గాయాలతో పాటు రెండు చేతులకు కూడా తీవ్రంగా దెబ్బలు తగిలాయి. అర్ధరాత్రి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తీసుకెళ్లారు. ఆదివారం సిఐ టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమనలు రాత్రి దాడి జరిగిన బ్యాంకు కాలనీ మధురానగర్ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రాజకీయ కారణాలా..? వ్యాపార లావాదేవీలలా..?

మాజీ సర్పంచ్ ఓంకార్‌పై దాడికి రాజకీయ కారణాలా? లేక వ్యాపార లావాదేవీలా? అనే విషయంపై స్థానిక చర్చించుకుంటున్నారు. సినీ ఫక్కీలో పక్కా పథకం ప్రకారం ఇనుప రాడ్లతో దాడి చేయడం ఈ ప్రాంతంలో ఒక్కసారిగా ఆందోళనకు గురి చేసింది. అదీ అర్ధరాత్రి దారి కాచి పాశవికంగా దాడి చేసిన సంఘటనతో పొదిలి ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. ఈ దాడికి వెనుక రాజకీయ కారణాలు ఏమైనా ఉన్నాయా.. స్థిరాస్తి వ్యాపార లావాదేవీలు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై చర్చించుచున్నారు. బలమైన రాజకీయ సామాజిక వర్గం కలిగిన ఓంకార్ కుటుంబం రాజకీయంగా గ్రామంలో బలమైన వర్గంగా ఉంది. గతంలో ఆయన ఉపసర్పంచిగా చేసి సర్పంచ్ రాజీనామాతో కొద్దికాలం సర్పంచ్‌గా పని చేశారు. రాజకీయాలతో పాటు స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కారణాలు ఏమనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

సంఘటన స్థలంలో రక్తపు మరకలను పరిశీలిస్తున్న పోలీసులు

ఆ నలుగురు ఎవరు..?

ఓంకార్‌పై దాడికి కారణమైన వారిలో ఆ నలుగురులో ఎవరు అని చర్చ జరుగుతోంది. బలమైన రాజకీయ వర్గం ఉన్నప్పటికీ గ్రామంలో ఎటువంటి తగాదాలు లేనట్లు గ్రామస్తుల సమాచారం. ఈ విషయంలో దాదాపు ఎటువంటి రాజకీయ కోణాలు లేకపోవడంతో ప్రధానంగా స్థిరాస్తి వ్యాపార లావాదేవీలే కారణంగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ విషయంలో నలుగురు వ్యక్తులను కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఓంకార్‌పై దాడి చేసిన వారిని త్వరలో పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

మూలగుంటపాడులో భారీ చోరీ

62 సవర్ల బంగారం, 15 కేజీల వెండి, రూ.5 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడులో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పరిధిలో నివాసం ఉంటున్న ఎల్ఐసి ఏజెంట్ పోత్తూరు రామ్మూర్తి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగాలేక అత్యవసరంగా ఈనెల ఒకటో తేదీన నెల్లూరు వెళ్లారు. తిరిగి కుటుంబ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం సమయంలో నెల్లూరు నుంచి వచ్చి ఇంటిని పరిశీలించగా ఇంటిలో కబోర్డులు మొత్తం చెల్లాచెదరుగా ఉన్నాయి. వంటగది వద్ద కిటికీని తీసి పక్కన పెట్టి ఉన్నారు. దీనిని గమనించిన రామ్మూర్తి హుటాహుటిన శింగరాయకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్సై ఎం.మహేంద్ర ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆ సమయంలో ఇంటిలో 62 సవర్ల బంగారం, రూ.5 లక్షల నగదు, 15 కేజీల వెండి ఉందని, ఇవన్నీ దొంగిలించినట్లు వివరించారు. దీంతో పోలీసులు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేయడంతో సిసిఎస్ సీఐ దాచేపల్లి రంగనాథ్ క్లూజ్ టీం బృందంతో రంగంలోకి దిగారు. ఆ ఇంటిలోనే చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. పోలీసులు అన్ని కోణాల్లో ఈ దొంగతనం కేసును విచారణ మొదలుపెట్టారు. ఆదివారం రాత్రి అయినప్పటికీ పోలీసులు పూర్తిస్థాయిలో విచారించే పనిలోనే ఉన్నారు. మూలగుంటపాడు గ్రామంలో ఇంత పెద్ద దొంగతనం జరిగిందని తెలియడంతో చుట్టుపక్కల ప్రాంతాల జనం అక్కడికి వచ్చి చూసి వెళుతున్నారు.

ఇంటిలో పరిశీలిస్తున్న సిఐ హజరత్తయ్య

కిటికీ గ్రిల్స్ తీసి ఉన్న దృశ్యం

అధ్వానంగా వాటర్ ట్యాంకులు

పాచిపట్టి దుర్వాసన వస్తున్న నీరు

పట్టించుకోని అధికారులు

పాచిపట్టి అధ్వానంగా ఉన్న వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలోని రాజు పాలెం పంచాయతీ పరిధిలోని ద్వారక చర్ల గ్రామంలో మినీ వాటర్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో పాచితో నిండిపోయి దుర్వాసన వస్తున్నాయి. ద్వారకచర్ల గ్రామంలో గుర్రాల బావి వద్ద మినీ వాటర్ ట్యాంక్ లోపలి భాగంతో పాటు బయట కూడా పాచి పట్టింది. కనీసం కుళాయిలు కూడా అమర్చకపోవటంతో వచ్చిన వాటర్ వచ్చినట్లుగానే బావిలోకి వెళుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే గ్రామంలోని మరో ట్యాంకు అంగన్‌వాడీ స్కూల్ వద్ద ఉన్న మినీ వాటర్ ట్యాంకు కూడా అధ్వానంగా ఉంది. సరఫరా చేసే పైపులైను పాచితో నిండి ఉంది. అపరిశుభ్రంగా ఉన్నటీ ట్యాంకుల్లో నీరు తాగితే ప్రజలకు, స్కూల్ పిల్లలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. కొళాయిలు అమర్చకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. గ్రామంలో అక్కడక్కడ కుళాయిలు ఉండటంతో కరెంటు ఉన్నంతసేపు కొళాయిలు దగ్గరనే నీటిని పట్టుకొని వినియోగించు కుంటున్నారు. కరెంటు లేని సమయంలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మినీ ట్యాంకర్లు శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

మార్కాపురం డిఎస్‌పి నాగరాజు

మాట్లాడుతున్న డిఎస్‌పి నాగరాజు

ప్రజాశక్తి-మార్కాపురం

దసరా, దీపావళి పండుగల వేళ... అన్ని మతాల ప్రజలు నిబంధనలు పాటిస్తూ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మార్కాపురం డిఎస్‌పి యు.నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలు సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు జరుపుకోవాలన్నారు. ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలకు పూనుకోవద్దన్నారు. అశ్లీల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టిన నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పండుగల వేళ రకరకాల జూదాలు ఆడినా చర్యలు తప్పవన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీపావళి సందర్భంగా బాణాసంచా తాత్కాలిక అమ్మకాల కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అక్రమంగా బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మార్కాపురం సిఐ పి.సుబ్బారావు పాల్గొన్నారు.

జూదరులపై కేసు నమోదు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని సూరారెడ్డిపాలెం శివారులో డంపింగ్ యార్డు వద్ద పేకాడుతున్న ఏడుగురి నుండి రూ.6,240లు స్వాధీనం చేసుకున్నట్లు టంగుటూరు ఎస్ఐ నాగమల్లీశ్వరరావు తెలిపారు. నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన ఎడ్లు

విద్యుత్ షాక్‌తో ఎడ్లు మృతి

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రెండు ఎడ్లు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామంలోని పంట పొలాల్లో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరముల ప్రకారం.. నాగులవరం గ్రామానికి చెందిన బి.కాశి రాజు ప్రతిరోజు లాగే మేత కోసం ఎడ్లను పంట పొలాల్లోకి తోలుకెళ్లి సాయంత్రానికి ఇంటికి వస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కూడా మేత కోసం పంట పొలాలకు వెళ్లిన రెండు ఎడ్లు ప్రమాదవశాత్తు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆకులు తింటున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై రెండు ఎడ్లు అక్కడే కుప్పకూలాయి. అటుగా పంట పొలాలకు వెళ్తున్న రైతులు ప్రమాదాన్ని గుర్తించి దరిమడుగు విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ షాక్‌తో తన రెండు ఎద్దులు మృతి చెందడంతో పశుపోషకుడు కాశిరాజు బోరున విలపిస్తున్నాడు. రెండు లక్షలు వెచ్చించి మూడు నెలల క్రితమే వీటిని కొనుగోలు చేశానని, అర్ధాంతరంగా ఇలా విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాయని ప్రభుత్వమే తనను ఆదుకోవాల్సిందిగా వేడుకుంటున్నాడు.

నగదు అందజేస్తున్న ఎస్ఐ నాగమల్లీశ్వరరావు

పోగొట్టుకున్న సొమ్ము అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

సంతనూతలపాడు మండలం, గొర్లమెట్ట గ్రామానికి చెందిన వృద్ధుడు మద్దినేని వెంకటేశ్వర్లు ఆదివారం తన గ్రామం నుండి రూ.85 వేల నగదు, ఒక వెండి గొలుసు సంచిలో పెట్టుకొని టంగుటూరు మండలం జమ్మల పాలెంలోని తన కుమార్తె ఇంటికి వచ్చాడు. టంగుటూరు నుంచి ఆటోలో బయలుదేరి జమ్ములపాలెంలో దిగి ఇంటికి వెళ్లి చూసుకోగా తన సంచి ఎక్కడో పడిపోయిందని గుర్తించాడు. వెంటనే టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకట్రావు టంగుటూరు నాలుగు రోడ్ల జంక్షన్ వద్దకు వెళ్లి విచారించగా సదరు వ్యక్తి తన సొమ్మును ఆటో ఎక్కిన చోటే పోగొట్టుకున్నట్లు గుర్తించి సంచిని వెంకటేశ్వర్లుకు అందజేశారు. పోయిన నగదు వెతికి బాధితునికి అందించడంలో చొరవ చూపిన హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రావును ఎస్ఐ నాగమల్లేశ్వరరావు అభినందించారు. మద్దినేని వెంకటేశ్వర్లు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లో వాట్సప్ మెసేజ్‌ల ద్వారా వివరాలు సేకరించి తద్వారా వారి బ్యాంక్ అకౌంట్లో ఉన్న డబ్బులు సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారని గిద్దలూరు ఇన్‌ఛార్జి సిడిపిఓ జ్యోతి తెలిపారు. ఈ మధ్యకాలంలో ఆరోగ్య శాఖకు సంబంధించిన వారమంటూ ఒక గర్భిణీ మహిళలకు ఫోన్ చేసి ఆమె బ్యాంకు వివరాలు చెప్పించుకున్న వెంటనే ఆ సైబర్ నేరగాడు ఖాతాలో ఉన్న డబ్బులు కాజేశాడని తెలిపారు. కావున ఇలాంటి ఫోన్ కాల్స్ మెసేజీలు వచ్చినప్పుడు సంబంధిత శాఖ అధికారుల సలహా తీసుకోవాలే కానీ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లు వివరాలు తెలపకుండా ఇలాంటి సైబర్ నేరగాల్ల మోసాలకు మోసపోవద్దని సిడిపిఓ తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - మార్టూరు

సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘనంగా నివాళు లర్పించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగులు సంఘం కార్యాలయంలో సీతారామ్ ఏచూరి సమస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు అధ్యక్షత వహించారు. సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య మాట్లాడారు. కమ్యునిస్టు ఉధ్యమ నిర్మాణంతోపాటు రాజ్య సభలో ప్రజాప్రతినిధిగా ప్రజాసమస్యలు, దేశ ప్రయోజనాలపై అనేక అంశాల్లో చర్చకు పెట్టి సాధించారని అన్నారు. ఉపాధి హామీ వంటి చట్టాలను పార్లమెంటులో ప్రతిపాదించి సాధించడం వల్ల దేశవ్యాప్తంగా లక్షల మంది పేదలకు ఉపాధి బద్రత ఏర్పడిందని అన్నారు. వ్యవసాయాన్ని దివాళా తీయించే విధంగా పార్లమెంటులో బిజెపి ప్రతిపాదించిన మూడు వ్యవసాయ రైతు వ్యతిరేక చట్టాలను పార్లమెంటులో తీవ్రంగా ప్రతిగటించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు. ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివార్సిటీలో చదువుతూ విద్యార్ది సంఘం ఎన్నికల్లో 3 సార్లు విద్యార్ది సంఘం అధ్యక్షునిగా ఎన్నికై విద్యార్థుల సమస్యలు పరిస్కారం కోసం కృషి చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పని చేశారని చెప్పారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం దేశంలో ప్రత్యామ్నయ రాజకీయాలను బలపరుస్తూ ఇండియా కూటమి రూపకల్పనలో సీతారాం ఏచూరి కృషి జాతీయ రాజకీయాల్లో కీలమైందని అన్నారు. అంతర్జాతీయంగా అనేక దేశాల కమ్యునిస్టు పార్టీలతో పరిచయాలతోపాటు అనేక అంశాల్లో మార్గదర్శిగా నిలిచిన సిద్దాంత కర్త ఏచూరి అని చెప్పారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఫాసిస్టు, ప్రవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించడమే ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మంజుందార్, కందిమళ్ల రామకోటేశ్వరరావు, రాంబాబు, బాపయ్య, సాంబశివరావు, నాగేశ్వరరావు, సూరి బాబు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య

అన్నదాతల అభ్యున్నతే 'నోవా' లక్ష్యం

- రైతన్నల నమ్మకంతోనే దేశంలో నెంబర్ వన్ స్థానం
- సమర్థవంతంగా అన్నదాతలకు సేవలు
- 700 ఉత్పత్తులతో రైతాంగానికి నిరంతర సేవలు
- నోవా ఫ్యామిలీ మీట్లో వ్యవస్థాపక అధ్యక్షులు ఏలూరి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా నోవా అగ్రి గ్రూప్ రైతన్నలకు నిరంతరం సేవలు అందిస్తుందని నోవా వ్యవస్థాపకులు, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. విజయవాడ ఫార్చ్యూన్ మురళి హెూటల్ వేదికగా నోవా ఫ్యామిలీ మెంట్ కన్నులు పండుగలా ఆదివారం నిర్వహించారు. ఒక్కడితో మొదలైన నోవా అగ్రి గ్రూప్ నేడు వేలాది మంది ఉద్యోగులు, డీలర్లతో దేశవ్యాప్తంగా అన్నదాతల మన్ననలు పొందుతూ అగ్ర భాగాన నిలిచిందని అన్నారు. నమ్మకం, విశ్వాసం, నిబద్ధతే ప్రామాణికంగా అనునిత్యం అన్నదాతల అభివృద్ధిని కాంక్షిస్తూ అన్నదాతల మదిలో నోవా నిలిచిందని అన్నారు. దేశంలో నెంబర్ వన్ స్థానంలో నోవా నిలవడానికి అందరి ఐక్యత, సమన్వయం, రైతుల నమ్మకమే కారణం అన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా అన్నదాతల అవసరాలకు అనుగుణంగా పంట ఉత్పత్తులను తయారు చేస్తూ రైతన్నల జేజేలు అందుకుంటుందని అన్నారు. అన్నదాతల కష్ట సమయంలో నూతన ఉత్పత్తులను తయారు చేసి రైతులకు అండగా నిలిచిందని అన్నారు. సమర్థవంతంగా సేవలందించిన ఘనత నోవా దేవనని అన్నారు. అన్నదాతల నమ్మకమే పెట్టుబడిగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించామని తెలిపారు. దీనికి ప్రధాన కారణం నోవా ఉత్పత్తుల అద్భుత పని తీరే అన్నారు. రైతన్నల మన్ననలు పొందుతూ భవిష్యత్తులో కూడా నిరంతరం రైతాంగానికి సేవలందిస్తూ ఇదే విశ్వాసాన్ని కొనసాగించేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. తాను డాక్టర్ అవ్వాలనే కోరిక ఉందని, అప్పటి పరిస్థితులకు కనుగుణంగా వ్యవసాయ విద్యను అభ్యసించి రైతాంగానికి విస్తృత సేవలు అందించాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేసి 2007లో హైదరాబాద్ వేదికగా కంపెనీ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్థానం ప్రారంభించిన నోవా అగ్రి టెక్ అన్నదాతల శ్రేయస్సు కోసం అనేక పరిశోధనలు జరిపి నాణ్యమైన ఉత్పత్తులను అందించిందని అన్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందించి రైతుల అభ్యున్నతికి విశేష సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతన్నలకు నాణ్యమైన ఉత్పత్తుల అందించి బాసటగా నిలిచిందన్నారు.

విజయవాడలో నోవా అగ్రిటెక్ ఫ్యామిలీ మీట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

అన్నదాతల నమ్మకమే విజయం

అన్నదాతల నమ్మకమే సంస్థ విజయానికి చిహ్నమని నోవా అగ్రిటెక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఏటుకూరి కిరణ్ కుమార్ అన్నారు. 'నోవా అగ్రిటెక్'పై రైతన్నల నమ్మకం, విశ్వాసం, అంకితభావంతో వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించి కంపెనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సీఈఒ మందలపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు, డీలర్లు ఇదే స్ఫూర్తితో అన్నదాతలకు సేవలు అందిస్తూ మరింత ముందుకు సాగాలన్నారు. కంపెనీకి కీర్తి ప్రతిష్టాలను పెంచే దిశగా అన్నదాతల అవసరాలకు అనుగుణంగా విస్తృత సేవలు అందించాలని అన్నారు. 700 రకాల ఉత్పత్తులను రైతులకు అందిస్తూ విశేష సేవలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజేష్, నేషనల్ మార్కెటింగ్ హెడ్ హర్ష, రీజినల్ మేనేజర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నోవా వ్యవస్థాపక ఛైర్మన్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రాష్ట్రస్థాయి విజేతలు మార్టూరు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యా బోధనలో నిత్యం ఉండే ఉపాధ్యాయులు ఆటల్లోను తీసిపోమంటూ నిరూపించారు. యూటీఎఫ్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల సందర్భంగా గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో బాపట్ల జిల్లా తరపున ఆటల్లో పాల్గొన్న మార్టూరు మండల ఉపాధ్యాయులు విజేతలుగా నిలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో మండలంలోని వలపర్ల ఎంపియుపి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న అట్లూరి ప్రశాంత్, సంతమాగులూరు మండలం అడివిపాలెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జిలాని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జావలిన్ త్రోలో వలపర్ల ఎంపియుపి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు కె జాకబ్ రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించారు. ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు అందుకున్న ఉపాధ్యాయులను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, యుటిఎఫ్ మార్టూరు అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఆదినారాయణ, పోపూరి సునీల్ కుమార్, జిల్లా కార్యదర్శులు కందిమళ్ల రవిబాబు, పాలపర్తి రామాంజనేయులు, ఈశ్వరప్రసాద్, వెంకట సుబ్బయ్య, ప్రతాప్, సూర్యప్రకాష్, మౌలాలి, యెహెూషువా అభినందించారు.

మార్టూరు : యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో మార్టూరుకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు తమ సత్తా చాటారు. విజేత లైన ఉపాధ్యాయులను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె వినయ్ కుమార్, ఏ శ్రీనివాసరావు అభినందించారు.

విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్మీనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని నాగులపాడు రోడ్డులోని శ్రీ బాలాజీ రెసిడెన్సీలో విశ్రాంత ఉపాద్యాయులు, రోటరీ మాజీ అధ్యక్షులు లక్ష్మినారాయణ దశదిన కర్మ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ ఆద్వర్యంలో జరిగిన సంస్కరణ సభలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు హాజరై ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి ఎందరో విద్యార్థులకు ఓనమాలు నేర్పి వారి ఉన్నతికి కారణం అయ్యారని అన్నారు. పేద విద్యార్థులకు అండగా ప్రోత్సాహం అందించి ఆదుకున్న వ్యక్తని అన్నారు. లక్ష్మినారాయణ యుటిఎఫ్ అధ్యక్షులుగా ఉపాద్యాయుల సమస్యల కోసం పోరాటం చేశారని అన్నారు. ఆయన సేవలు మరువ లేమని అన్నారు. రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ రోటరీ అధ్యక్షులుగా పేదలకు నేనున్నానని భరోసా కల్పించి, పేదవారిని గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటు అందించారని అన్నారు. పేద కుటుంబాలకు వెలుగు నిచ్చిన వ్యక్తిగా అభివర్ణించారు. ఈ సంస్కరణ సభలో చక్రాయపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కెవి శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, జె బాబురావు, పిఎల్‌వి నరసింహారావు, ఎఎల్‌ఎస్ ప్రసాద్, భువనేశ్వరి, భాషా, మల్లాది శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ దాతలు

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని పూసపాడు వాస్తవ్యులు నిడమానూరు మధుకుమార్, శ్రీలత కుమార్తె లతికశ్రీ గుప్త పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని శ్రీ భవానీ మహిళా మండలి వృద్ధుల ఆశ్రమంలో వృద్దులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడమానూరు పున్నారావు, కృష్ణ కుమారి, ఆశ్రమ నిర్వాహకులు ప్రెసిడెంట్ టి వినీత, భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి, కో ఆర్డినేటర్ భవనం సాయి, మేనేజర్ రామమోహన్ పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామ పంచాయతీ పరిపాలన, పంచాయతీరాజ్ చట్టం అంశాలపై రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి ఆదివారం తెలిపారు. మండల స్థాయిలో ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఒక ఉప సర్పంచ్, ఒక వార్డు సభ్యులు (పురుషులు), ఒక మహిళా సభ్యురాలిని ఎంపిక చేసి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ నుండి ముగ్గురు సభ్యుల బృందం తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గ్రామస్థాయిలో మరింత మెరుగైన అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కష్టాల కడలిలో కౌలు రైతులు

- పేరుకే హక్కు పత్రాలు
- రుణాలు ఇవ్వని బ్యాంకర్లు
- పంటల సాగుకు ఇక్కట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,54,739 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. సుమారు 40 శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారు. 80 వేల మంది కౌలు రైతులు అనధికారికంగా ఉన్నారు. అధికారికంగా ప్రభుత్వం 45 వేల మంది రైతులకు మాత్రమే సాగు హక్కు పత్రాలు (సిసిఆర్‌సి) మంజూరు చేయాలని నిబంధన పెట్టింది. ఇప్పటి వరకు 42,175 మంది రైతులకు పత్రాలను అందజేశారు. ఖరీఫ్‌లో కౌలు రైతులకు రూ. 121 కోట్లు పంట రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకుర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు కేవలం 856 కౌలు రైతులకు రూ. 12.84 కోట్ల రుణాలు మంజూరు చేశారు. 1512 గ్రూపులకు మాత్రమే రూ. 18.69 కోట్ల పంట రుణాలు మంజూరు చేశారు. ఒకవైపు సాగు హక్కు పత్రాలు మంజూరు కాకపోగా మరోవైపు బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వపోవడంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డిమాండ్‌ను బట్టి కౌలు ధర..

డిమాండ్‌ను బట్టి ఎకరాకు రూ.18 వేలు నుంచి రూ.30 వేలు వరకు కౌలు చెల్లిస్తున్నారు. సాగులో కౌలు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంట సాగు హక్కు పత్రాలు (సిసిఆర్‌సి) జారీ చేసి, తద్వారా రుణాలు మంజూరు చేసేందుకు ఏటా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలానికి 2 వేల మందికి హక్కు పత్రాలు జారీ చేయాలని ఈ ఏడాది లక్ష్యాలను నిర్దేశించారు. పత్రాల ప్రాముఖ్యతపై అవగాహన సద స్సులు, గ్రామ సభలను రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. భూ యజమాని హక్కుకు భంగం కలగకుండా కౌలుదారులకు ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. పత్రాల జారీ, పంట రుణాల మంజూరు ప్రక్రియ ఆచరణలో విఫల మైంది. కొందరికి పంట సాగు హక్కు పత్రాలు (సిసిఆర్‌సి) పత్రాలు ఉన్నా బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాలేదు. దీంతో వ్యాపారుల వద్ద బంగారం తాకట్టు పెట్టి అధిక వడ్డీలకు అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు.

మిర్చిపంట

అడ్డంకిగా మార్గదర్శకాలు..

సిసిఆర్‌సి కార్డుల జారీకి భూ యజమాని సంతకాన్ని తప్పనిసరి చేశారు. వారు సంతకాలు చేసేందుకు విముఖత చూపుతున్నారు. పొలానికి కౌలుకు ఇచ్చినా కొందరు భూయజమానులే రుణాలు పొందుతున్నారు. సిసిఆర్‌సి కార్డు ఉన్నప్పటికీ రుణాల నమోదు తప్పనిసరి చేశారు. బ్యాంకు రుణం మంజూరుకు ఈ నిబంధన ప్రతిబంధకంగా మారింది. దీనికి తోడు గతేడాది తీసుకున్న రుణాలు కొందరు తీర్చడం లేదని, కొత్త వారికి ఇవ్వడం లేదు. వ్యక్తిగత రుణం కన్నా గ్రూపులకే కొన్ని బ్యాంకులు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

విస్తీర్ణం తగ్గడంతోనే..

పంట సాగు పత్రాలు పొందినప్పటికీ సాగర్ కాలువల్లో నీటి విడుదల లేకపోవడంతో అనేక మంది కౌలు రైతులు వ్యవసాయానికి దూరమయ్యారు. దీంతో రుణం పొందిన వారి సంఖ్య తక్కువగా ఉంది.సిసిఆర్‌సి ఉన్న ప్రతి కౌలుదారుకు వ్యక్తిగతంగా లేదా బందంగా రుణాల దీంతో మంజూరుకు చర్యలు తీసుకుంటున్నాం. రుణ మంజూరులో ప్రతిబంధకాలను అధిగమించేందుకు బ్యాంకర్లను సమన్వయం చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ వారి మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయింది. గత్యంతరం లేక కౌలు రైతులు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సి వస్తుంది.

సిసిఆర్‌సి పత్రం మంజూరు చేయలేదు

షేక్ అల్లాబక్షు, రైతు, యర్రగొండపాలెం

ఐదెకరాలు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేశా. ఇప్పటికి సుమారు రూ.3 లక్షలకు పైగా పెట్టుబడి అయింది. పంట సాగు హక్కు పత్రం మంజూరు చేయలేదు. ఫలితంగా బ్యాంకులో రుణం మంజూరు చేయలేదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు చేసి పంటలు పండిస్తున్నా.ం

బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశాం

శ్రీనివాసరావు,
జిల్లా వ్యవసాయాధికారి

కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు ఆదేశాలిచ్చాం. బ్యాంకర్లతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పంట రుణాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నాం. కౌలు రైతులు కూడా బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందవచ్చు.

ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు

- రవాణా ఛార్జీల ఆధారంగా ఇసుక ధర నిర్ణయం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక సరఫరా కోసం జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో ఎక్కడ ఇసుక అధికారికంగా అందుబాటులో లేకుండా పోయింది. దీంతో జిల్లాకు చెందిన వారు ఇసుక కోసం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉన్న ఇసుక రీచ్‌ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది. ఫలితంగా వారికి రవాణా ఛార్జీలు అదనపు భారంగా మారాయి. ఇతర జిల్లాల లోని రీచ్‌ల వద్ద పడిగాపులు కాయాల్సి రావడంతో సమయం కూడా వృథా అవుతుంది. మరో ప్రక్క అధికారం అండగా ఇసుక అక్రమార్కులు విజృంభిస్తున్నారు. కొన్ని చోట్ల అధికారులు కూడా అండగా నిలవడంతో అక్రమ ఇసుకను రవాణా నిలవరించడం కష్టంగా మారింది. ప్రభుత్వ అసైన్డ్ భూములు, కాలువ కట్టలు, చెరువు కట్టలు, అటవీశాఖకు చెందిన భూముల్లో నుంచి ఇసుక తరలిస్తున్నారు.

మరో ప్రక్క ఇసుక దొరక్క నిర్మాణ రంగం కుదేలైంది. చాలా చోట్ల భవన నిర్మాణ పనులు నిలిపివేశారు. ఇసుక అందుబాటులో లేకపోవడం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది.ఈ నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తీసేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేపట్టింది. నదిలో వరద నీరు కూడా తగ్గుముఖం పట్టిన క్రమంలో కొల్లూరు మండలంలోని గాజుర్లంక, జువ్వలపాలెం గ్రామాలలో ఇసుక రేవులను జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఇతర అధికారులు పరిశీలించారు. కొల్లూరు మండలం గాజుల లంక వద్ద 74,249 మెట్రిక్ టన్నులు, జువ్వలపాలెం వద్ద 74,400 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉన్నట్లు తేల్చారు. ఈనెల 15 నుంచి ఆ ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తేనున్నారు. జిల్లాలో మొత్తంగా 4 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక అవసరం ఉంటుందని, దాని సేకరణకు కసరత్తు చేస్తున్నారు. పట్టా భూముల్లోంచి కూడా ఇసుక వెలికి తీసేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో మరో లక్షన్నర మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా బట్టిప్రోలు మండలం ఓలేరు,కొల్లూరు మండలం గాజుల లంక-2 రీచ్‌ల ద్వారా మరో లక్షన్నర మెట్రిక్ టన్నులు ఇసుక లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. జిల్లా పరిధి లోనే మరో రెండు రీచ్‌ల ద్వారా మరో లక్షన్నర మెట్రిక్ టన్నులు ఇసుకను సేకరించడం ద్వారా జిల్లాలో ఇసుక అవసరాలు తీరుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ రీచ్‌ల నుంచి ఇసుక సేకరించి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో స్టాక్ పాయింట్లు పెట్టి ప్రజలకు అందించాలని భావిస్తున్నారు. సాధ్యమైనంత తక్కువ ధరకు ఇసుక అందించే దిశగా కసరత్తు చేస్తున్నారు.

పట్టాభూముల్లో ఇసుక త్రవ్వకాలకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేశారు. భూమి యజమాని పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్ పుస్తకం, గ్రామ మ్యాప్‌లో భూమి యొక్క ప్రదేశాన్ని తెలుపుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆ భూమిని సంయుక్త పరిశీలన చేస్తుంది. పట్టా భూముల నుంచి ఇసుకను తరలించే ప్రతిపాదనలను డిఎల్ఎస్‌సి పరిశీలించి ఆమోదం తెలుపుతుంది.చట్టబద్ధమైన అనుమతులు పొందిన తర్వాత నదీగర్భ పరిధిలోకి వచ్చే పట్టా భూముల నుంచి ఇసుక డీ-కాస్టింగ్ చేపట్టేందుకు జిఎస్‌టితో మెట్రిక్ టన్నుకు రూ.60 వంతున ప్రభుత్వం పట్టాదారునికి చెల్లిస్తుంది. నదీగర్భం వెలుపల ఉండే పట్టా భూములకు గరిష్టంగా మెట్రిక్ టన్నుకు రూ.250 వంతున వినియోగదారునికి సరఫరా చేయాల్సి ఉంది.

కష్ణా నది పరివాహక ప్రాంతంలోని ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

రాజశేఖర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న నాగేంద్రరావు

రాజశేఖర్ కుటుంబానికి .. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు టుటౌన్ పోలీసులు కొట్టి అవమానించడంతో పురుగుమందు తాగి మరణించిన పరుచూరి రాజశేఖర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు.రిమ్స్ పోస్టుమార్టం గదిలో పరుచూరి రాజశేఖర్ మతదేహాన్ని నాగేంద్రరావు ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం పోలీసులు చూపిన అత్యుత్సాహమే రాజశేఖర్ బలవన్మరణానికి కారణమైందన్నారు. రెండు సంవత్సరాల క్రితం కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో వింటాస్ హేచరీస్ ఎమ్‌డి ఎస్‌వి.సుధాకర్ కు - మేనేజర్ పరుచూరి రాజశేఖర్‌కు మధ్య ఆర్థిక లావాదేవీల వివాదంపై పరిష్కారం జరిగిందన్నారు. అధికారం మారడంతో అధికార పార్టీ ముఖ్య నేత సూచన మేరకు పరుచూరి రాజశేఖర్‌ను ఒంగోలు టుటౌన్ పోలీసులు సెప్టెంబర్ 30న స్టేషన్‌కు పిలిపించారన్నారు. వింటాస్ హేచరీస్‌లో జరిగిన ఆర్థిక అవకతవకలపై నేరం అంగీకరించాలని రాజశేఖర్‌ను అవమానకరంగా కొట్టారన్నారు. బలవంతంగా కాగితాలపై సంతకం చేయించుకున్నారన్నారు. అవమాన భారంతో పురుగు మందు తాగిన రాజశేఖర్ జరిగిన ఘటనపై సూసైడ్ నోట్ కూడా రాశారని, ఆ నోట్ లో తనను కొట్టిన పోలీసుల పేర్లు, ఏం జరిగిందనే వివరాలను పేర్కొన్నాడన్నారు. రాజశేఖర్ బలవన్మరణానికి పోలీసులపై అధికార పార్టీ నేతల ప్రభావమే కారణమన్నారు. ఒంగోలు టూ టౌన్ పోలీసుల ఖాకీ క్రౌర్యానికి పరుచూరి రాజశేఖర్ మరణించాడన్నారు. రాజశేఖర్‌ను స్టేషన్లో కొట్టి అవమానించిన పోలీసులను విఆర్ పంపితే సరిపోదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పరుచూరి రాజశేఖర్ బలవన్మరణాన్ని కస్టోడియల్ డెత్‌గా పరిగణించి కలెక్టర్, ఒంగోలు ఆర్‌ఒడి ద్వారా మేజిస్టీరియల్ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నాగేంద్రరావు వెంట బహుజన గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు ఉన్నారు.

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొనసాగుతున్న ఉచిత అన్నదానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు లాయర్ పేటలో డొక్కా సీతమ్మ ఉచిత అన్నదానం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆదివారం నాటికి 81వ రోజుకు చేరింది. ఆర్తి జన్మదిన సందర్భంగా కుటుంబ సభ్యులు డొక్కా సీతమ్మ ఉచిత అన్నదానం ద్వారా ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. డొక్కా సీతమ్మ పేరుతో ఉచిత అన్నదానం చేపట్టిన జనసేన పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర యాదవ్‌ను వారు అభినందించారు. దాతలు కూడా ముందుకొచ్చి డొక్కా సీతమ్మ ఉచితన ఉచిత అన్నదాన నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు పార్శ కోటయ్య, కోట సుధాకర్, ఆర్తి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనాధలకు అండగా రవీంద్రబాబు

ప్రజాశక్తి - వేమూరు

అనాధలకు అండగా ఉంటూ వారిని అక్కున చేర్చుకొని ఆశ్రమాలకు చేరుస్తూ భరోసా కల్పిస్తున్న సహృదయ సేవా ఫడేషన్ అధ్యక్షులు రవీంద్రబాబు సేవలను ప్రజలు అభినందిస్తున్నారు. వేమూరుకు చెందిన రవీంద్రబాబు గుంటూరులో నారాయణ(40) అనే వ్యక్తికీ కాలు పాదం పై భాగంన, మోకాలుపైన పెద్ద గాయాలు ఏర్పడి నడవలేని స్థితిలో ఉండగా గుంటూరు లోని బ్రాడీపేట ఒకటో లైను ఐదో అడ్డరోడ్ నందు భోజనం పంపిణీ చేస్తున్న సమయంలో ఆ వ్యక్తిని గమనించి అతని అంగీకారంతో అరండల్ పేట పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది సహకారంతో నిర్మల్ హృదయ్ ఆశ్రమంలో చేర్పించారు. అంతటితో ఆగకుండా ప్రతిరోజు దాదాపు 50 మంది అనాధలకు నిత్యం తానే భోజనం తయారు చేసి సైకిల్‌పై తిరుగుతూ రహదారి వెంట ఉన్న వారికి అందిస్తూ ఉంటారు. కాగా 2013 నుండి ఇప్పటి వరకు 256 మంది ని ఆశ్రమంలో చేర్పించినట్లు రవీంద్ర బాబు తెలిపారు.

వికలాంగుడిని ఆశ్రమానికి చేరుస్తున్న రవీంద్రబాబు

సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ప్రతినిధులు

వృద్ధాప్యం దేవుడిచ్చిన వరం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక సినియర్ సిటిజన్ కార్యాలయంలో 34వ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. సభలో పలువురు వృద్ధులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణమూర్తి మాట్లాడుతూ వృద్ధాప్యం దేవుడిచ్చిన వరమని అన్నారు. వృద్ధులను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు ప్రత్యేక రాయితీ, సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాగవీరభద్రాచరి, హరిహరవు, వెంకటేశరరెడ్డ్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు భాస్కరరావు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అద్దేపల్లి గ్రామంలోని సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆవరణలో తెనాలిలోని శ్రీ లక్ష్మీ విజన్ కేర్ సెంటర్ అధినేత డాక్టర్ పంచుమర్తి భాస్కరరావుచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చిన 125మందికి ఆధునిక పరికరాలతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కొంత మందికి కళ్ళ జోళ్ళు అవసరమని తెలిపారు. మరి కొంత మందిలో శుక్లంలు ఉన్నట్లు గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వి నాగేశ్వరరావు, హెడ్ మిస్ట్రెస్ వి భారతి, టీచర్స్ ఆంధ్రూస్, సువర్తన, రత్నకుమార్, విజయవాడ శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ జొన్నాదుల రమేష్, వైద్య బృందం పాల్గొన్నారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంను నిర్వహించిన డాక్టర్ పంచుమర్తి భాస్కరరావుకు సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ వి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

నేడు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అధిక వర్షాలతో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి చేనేత కార్మిక సంఘం (ఎఐటి యుసి) రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఎపి చేనేత కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణలు తెలిపారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేనేత కార్మికుల మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో కార్మికులు పనులు కోల్పోయి ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. వర్షాల కారణంగా ఉపాధిని కోల్పోయిన చేనేత కార్మికులకు మంగళగిరిలో ప్రభుత్వం అందించిన విధంగా భట్టిప్రోలులోని చేనేత కార్మికులకు పరిహారం అందించాలని కోరారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో చేనేత నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామ కోట్టేశ్వరరావు, ఎఐటి యుసి నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం నాయకులు బాలాజీ

చెరుకుపల్లి : ఇటీవల కురిసిన వర్షాల వలన ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలంటూ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఇటీవల కాలంలో అధిక స్థాయిలో వర్షాలు కురవడంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. చేనేతలను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటియుసి), ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (సిఐటియు), ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఏఐఎఫ్టియు న్యూ) ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని తెలిపారు. చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘ నాయకులు గొట్టిముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, మద్రివాడ వెంకటరావు పాల్గొన్నారు. ఇటీవల వర్షానికి నష్టపోయిన మంగళగిరి చేనేత కార్మికులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసిన తరహాలో చెరుకుపల్లి పరిసర ప్రాంతాల్లో కూడా చేనేత కార్మికులకు నష్టపరిహారం అందజేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఇసుక దర్శిలోని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మహిళలు, పురుషులకు వేరు వేరుగా ఓపికౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపుకు హాజరైన పురుషులు, మహిళలకు వేర్వేరుగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంపుకు హాజరైన వారికి ప్రత్యేక వైద్య బృందం రక్త, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరానికి 793మంది హాజరు కాగా 130 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు రిఫర్ చేశారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, కామినేని జనార్ధన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలు అందించడంలో ఎంఎల్ఎ ఏలూరికి సాటి లేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల బాధ్యతగా నెల నెలా నిరంతరం ఏలూరి కంటి వైద్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చురగొన్నారని అన్నారు. మచ్చలేని నాయకుడిగా సేవే పరమావధిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. వైద్య శిబిరాలను ఎన్నికల వరకే కాకుండా నిరంతరం కొనసాగించడంలో ఏలూరికి సాటిలేరని అన్నారు. సమాజం పట్ల బాధ్యతగా సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికి కంటి వైద్య శిబిరం ద్వారా సేవలందిస్తూ కంటి వెలుగు ప్రదాతగా ఎంఎల్ఎ ఏలూరి నిలిచాడని అన్నారు. గత 15ఏళ్లుగా రాజకీయాలకు అతీతంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ లక్ష మందికి కంటి వైద్య శస్త్ర చికిత్సలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, రంగయ్య చౌదరి, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్ధన్, బేతపూడి సురేష్, అడుసుమల్లి శ్రీనివాసరావు, కృష్ణయ్య, అనీల్, సుధాకర్, విష్ణు, గోరంట్ల శ్రీను పాల్గొన్నారు.

వైద్యశిబిరం ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

దారిదోపిడీ దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - వేటపాలెం

రాత్రి వేళల్లో దారి కాపు కాసి బెదిరించి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చీరాల ఇన్చార్జి డిఎస్పి పి జగదీష్ నాయక్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు చెందిన షాలెం రాజు తమ అమ్మను తీసుకెళ్లడానికి చీరాల రైల్వే స్టేషన్‌కు గత నెల 30న అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో కడవకుదురు రైల్వే గేటు దాటిన తర్వాత మూత్ర విసర్జనకు బండి ఆపగా అదే సమయంలో ఐదుగురు దొంగలు అతన్ని అడ్డగించినట్లు తెలిపారు. పొన్నూరు అనసరకాలవకట్ట నేతాజీ నగర్ 16వ వార్డుకు చెందిన షేక్ మదర్, ఒంగోలు కొప్పోలు రోడ్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన దేవరకొండ మదన్ సాయి, బాపట్ల ఉప్పరపాలెం అంబేద్కర్ నగర్‌కు చెందిన చేగుడి ఆనందబాబు, బాపట్ల బేతన్ కాలనీకి చెందిన శీలం వంశీకృష్ణ, బాపట్ల టౌన్ పోలేరమ్మ చెట్టు శారదాపురి కాలనీకి చెందిన షేక్ సైదాలు రెండు బైకులపై వచ్చి అతనిని బెదిరించి ఇనుపరాడు చూపించి స్మార్ట్ ఫోన్, బండిని కూడా దొంగిలించి వెళ్లిపోయారని తెలిపారు. బాధితుని పిర్యాదు మేరకు ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించారు. ఈ దొంగతనం కేసు ఛేదించడానికి మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 5న రాత్రి రెండు గంటల సమయంలో 216 జాతీయ రహదారిపై ఉన్న గాయత్రీ బిర్యానీ పాయింట్ వద్ద నాలుగు మోటర్ సైకిళ్ల ఆపి నలుగురు వ్యక్తులు మాట్లాడుకుంటున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లుకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా పోలీసు జీబు చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా సిబ్బంది సహాయంతో పట్టుకొని విచారించినట్లు తెలిపారు. దొంగతనం కేసులో ముద్దాయిలుగా నిర్ధారించి అరెస్టు చేశారని తెలిపారు. ఎ1 ముద్దాయి షేక్ మదర్‌పై 29కేసులు, ఎ2 ముద్దాయి దేవరకొండ మదన్ సాయిపై రెండు కేసులు, ఎ3 ముద్దాయి చేగుడి ఆనందబాబు పై 11కేసులు, ఏ4 ముద్దాయి సలీం వంశీకృష్ణపై రెండు కేసులు, ఏ5 ముద్దాయి షేక్ సైదాపై ఐదు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఎ5 ముద్దాయి షేక్ సైదా పరారీలో ఉన్నాడని చెప్పారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ముద్దాయిలు వద్ద నుండి 22 మొబైల్ ఫోన్లు, ఒక ట్యాబ్, రూ.4.13లక్షల విలువగల ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన చీరాల రూరల్ సీఐ పీ శేషగిరిరావు, ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు, పోలీస్ కానిస్టేబుళ్లను డిఎస్పి జగదీష్ నాయక్ అభినందించారు.

సమావేశంలో డిఎస్‌పి పి జగదీష్‌నాయక్

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల కృష్ణానది వరద ముంపుకు గురైన భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని లంక గ్రామాల్లో విలేజ్ రీ కన్స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ (విఆర్ఓ) ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. భట్టిప్రోలు మండలం చింతమోటు, యలవర్తిగూడెం, పెదలంక, పెసర్లంక, పల్లెపాలెం, మద్యగూడెం, కొల్లూరు మండలం కొత్తగూడెం గ్రామాలకు చెందిన 830 కుటుంబాలకు సహాయం అందజేశారు. గుంటూరు గూడెం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు, పాలక మండలి సభ్యులు గ్రామాల వారీగా ఒక్కొక్క కుటుంబానికి 10కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ గోధుమ పిండి, కేజీ నూనె, కేజీ పచ్చడి సీసాలను అందజేశారు. ఈ సందర్భంగా విఆర్ఓ సంస్థ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఫాదర్ వేళాంగిణిరాజు మాట్లాడుతూ వరద కారణంగా కూలీ పనులు లేక ప్రజలు పడుతున్న కష్టాలను న్యాయవాది గుంటూరు కృష్ణ తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కష్ట కాలంలో ఉన్న ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ముంపు బాధ నుండి ప్రజలు విముక్తి పొంది యథాస్థితిలో జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆర్గనైజేషన్ లీగల్ అడ్వైజర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది తాడిపర్తి బాలస్వామి మాట్లాడుతూ వరదల్లో సర్వస్వం కోల్పోయి బాధల్లో ఉన్నవారికి భరోసా ఇవ్వటానికి విఆర్ఓ సంస్థ తమ వంతు సహాయం అందిస్తుందని తెలిపారు. సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఆర్గనైజేషన్ పాలక మండలి సభ్యులు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చక్రపాణి, హైకోర్టు న్యాయవాది జయప్రకాష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాధితులను సామాజిక బాధ్యతగా భావించి చేయూత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మేరీ శాంతి, క్లారా, మేరీ కుమారి, సురేష్ కుమార్, ఫాదర్ సురేష్, ఫాదర్ ఇమ్మానియేల్, హైకోర్టు న్యాయవాది రాజశేఖర్, రేపల్లె సర్కిల్ ప్రతినిధి కె దేవకి పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న విఆర్ సభ్యులు

మోటారును ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతాంగాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి - వేటపాలెం

రైతాంగ సమస్యల పరిష్కారించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. మండలంలోని చల్లారెడ్డి పాలెం పంచాయితీలోని మోటుపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా బచ్చులవారిపాలెం రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం మోటార్లను ఆయన ఆదివారం ఆన్ చేశారు. రైతాంగానికి ఏ కష్టం వచ్చిన వెంటనే పరిష్కారం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. చప్పిడి వెంకట్రావు, బచ్చుల సోమయ్య, పెరుగు భాస్కరరావు, పల్లెకారి రాములు, పెరుగు శ్రీనివాసరావు, మీసాల అంకిరెడ్డి, చప్పిడి రామచంద్రరావు, నంగు సుబ్బారెడ్డి, చప్పిడి చైతన్య, కప్పల బాబు, కీర్తి వెంకటేశ్వర్లు, గొర్ల రాముడు, కీర్తి శ్రీనివాసరావు, కర్ణ శ్రీనివాసరావు, ఉమ్మడి శంకర్రావు, ఒలుకల అయ్యప్ప, బిజెపి చంద్ర, జనసేన ఆర్‌కె నాయుడు, దోగుపర్తి బాలకృష్ణ, గంజి పురుషోత్తం పాల్గొన్నారు.

గాంధీ సేవ రత్న అవార్డు అందుకుంటున్న సుమన్

గాంధీ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని కోడిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ నండూరి కార్తీక్ సోదరుడు నండూరి సుమన్ మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డు అందుకున్నారు. మహాత్మా గాంధీ 155వ జయంతి, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు సిటీ కల్చరల్ సెంటర్ నందు మనం ఫౌండేషన్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సుమన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణు గోపాలచారి, రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, మనం ఫౌండేషన్ అధ్యక్షుడు కడపగాండ్ల చక్రవర్తి మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డును అందజేసినట్లు ఫౌండర్ చైర్మన్ నండూరి కార్తీక్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : మేరుగ

ప్రజాశక్తి - బాపట్ల

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేరుగా నాగార్జున భరోసా ఇచ్చారు. నూతనంగా జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించాక ఆయన పట్టణంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమి చెందాక వైసిపి కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కార్యకర్తలు ధైర్యంగా పార్టీ కోసం నిలబడి పోరాడుతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ బుక్ పాలన నడుస్తుందని అన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు అధిష్టానం చేపట్టిందని చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన ప్రభుత్వంగా చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే ప్రజల్లో ప్రభావం కోల్పోయిందని అన్నారు. కొందరు స్వార్థంతో పార్టీని వీడుతున్నప్పటికీ నిజమైన కార్యకర్తలు మాత్రం పార్టీతోనే ఉన్నారని

మాజీ మంత్రి మేరుగ నాగార్జునను సత్కరిస్తున్న కార్యకర్తలు

చెప్పారు. వైసిపికి ప్రజాబలం తగ్గలేదని అన్నారు. ఏ కార్యక్రమం చేపట్టిన పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యకర్తలను ఏకతాటిపై తీసుకువచ్చి పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్, దివ్యాంగుల నాయకుడు చల్ల రామయ్య, జోగి రాజా పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి అద్దంకి

పుట్టంరాజు బుల్లెయ్య, రామ లక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు, మైనంపాటి వీరరాఘవశర్మ మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మారంవారి సేవాసదన్ వేదికగా ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షులు వారణాసి రఘురామశర్మ ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యనే కాక, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను బోధిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రిటైర్డు ఆర్‌జెడి డాక్టర్ యు దేవపాలన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్పు తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. విద్యా రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ రకమైన పురస్కారాలు ఇవ్వడం ఎంతో గర్వకారణమని చెప్పారు. మలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి వలన ఎంతో మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని అన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని పేర్కొన్నారు. పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పురస్కార గ్రహీతలు చేసిన కృషి అనిర్వచనీయమని అన్నారు. వారి సేవలకు గుర్తుగా ఈ పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని అన్నారు. ఎడ్యుకేషనల్ ఎపిఫని అధ్యక్షులు డాక్టర్ తవనం వెంకటరావు మాట్లాడుతూ మైనంపాటి వీరరాఘవశర్మ జ్ఞాపకార్థం ప్రతిష్టించిన ఈ పురస్కారాలు విశిష్ట ఉపాధ్యాయుల సేవలను గుర్తించేందుకు శాశ్వత గుర్తుగా నిలుస్తాయని అన్నారు. డివిఎం సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటీషు వారు

విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

మన విద్యా వ్యవస్థను నాశనం చేశారని అన్నారు. గుమస్తా ఉద్యోగాలకు పనికి వచ్చే చదువును మాత్రమే భారతీయ విద్యా ప్రణాళికలో చేర్చారని అన్నారు. ఇప్పుడిప్పుడే మన విద్యావ్యవస్థ చక్కబడుతుందని పేర్కొన్నారు. జాతి నిర్మాతలు ఉపాధ్యాయులని అన్నారు. సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులని అన్నారు. వేములకొండ హనుమంతరావు, గుడిపూడి అంజయ్య, యర్రమోతు వీరస్వామి, నిమ్మరాజు నాగేశ్వరరావును పురస్కార ద్రవ్యం, నూతన వస్త్రాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, జమ్మలమడక హనుమంతరావు, మంచికలపాటి రాధాకృష్ణమూర్తి, ఆర్‌వి రాఘవరావు, చుండూరి మురళీసుధాకరరావు, కెవి పోలిరెడ్డి, సంకాబాబు, బత్తుల అంజయ్య, కందికట్ల సత్యం, మహమ్మద్ రఫి, భువనేశ్వరి, డివిఎం సత్యనారాయణ, జె ప్రతాప్, గోపినాథం హరనాథ్, పుట్టంరాజు పట్టాభిరామారావు, పిఎల్‌వి నరసింహారావు, మిట్టా కామేశ్వరశర్మ, బాలు ఆర్టిస్టు, పిసిహెచ్ కోటయ్య, ఇలపావులూరి శేషతల్ప శాయి పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - నిజాంపట్నం

హత్యకు గురైన భూషయ్య

కనకదుర్గమ్మ అమ్మవారి బొమ్మను పెట్టే విషయంలో జరిగిన వివాదంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకున్నారు. ఎస్ఐ కెకె తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలం దాసరిపాలెంకు చెందిన నున్న భూషయ్య (50) గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి బొమ్మను పెట్టే విషయంలో ఈ సారి పిల్లలు కాకుండా గ్రామంలోని అందరూ కలిసి పెట్టుకుందామని గ్రామంలోని కొంతమందికి చెప్పగా అలా పెట్టడం కుదరదని నున్న భూషయ్యతో గ్రామంలోని ఇద్దరు వాదించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ఇద్దరు నిందితులు శనివారం రాత్రి మండలంలోని ఆముదాలపల్లి రెవిన్యూ పరిధిలోని మంచినీటి భావి వద్ద కూల్ డ్రింక్స్ తాగుతున్న నున్న భూషయ్య అతని స్నేహితుడిని చూసి వచ్చిన నున్న భూషయ్యపై నిందితులు దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో భూషయ్యకు తీవ్రంగా గాయమైందని తెలిపారు. రేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిరక్షించి మార్గం మధ్యలో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు నున్న భూషయ్య కుమారుడు నున్న అజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేతిరాత పోటీలు నిర్వహిస్తున్న గ్రంధపాలకుడు

చేతిరాత పోటీలు

ప్రజాశక్తి అద్దంకి

స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయం నందు విద్యార్థులకు చేతి వ్రాత పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు గ్రంథపాలకుడు సుగుణరావు తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్జెడి ఉబ్బా దేవపాలన గ్రంథాలయంనకు 400 పుస్తకంలను, స్టీల్ బుక్ రాక్‌ను బహుకరించారు. పోటీలకు జ్యోతి చంద్రమౌళి న్యాయ నిర్ణీతగా వ్యవహరించారు. పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వీర్రాజు, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ జి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - అద్దంకి



హిమవంతినీదేవి అలంకరణలో అమ్మవారు

పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 53వ శరన్నవరాత్రి మహోత్సవం సందర్భంగా 4వ రోజు శ్రీ హిమవంతిని దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులుకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చీరాల : పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయం, దండుబాటలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగించారు.

డంపింగ్ యార్డుగా తాగునీటి చెరువు

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

చెరువులో డంప్ చేసిన చెత్త

పంచాయతీ పారిశుధ్యం కార్మికులు గ్రామంలో సేకరించిన చెత్త మొత్తాన్ని చెన్నుపల్లి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన నుంచి చెత్త, వ్యర్థాలను పడేస్తున్నారు. ఎక్కడో డంపింగ్ యార్డులో వేయాల్సిన చెత్తను చెరువులో వేయడం వల్ల తాగునీరు కాలుషితం అవుతుంది. ఆ నీటిని గేదెలు తాగడం వలన గేదెలకు అనేక రకాల వ్యాధులు వస్తున్నాయి. ఆ మార్గం గుండా ప్రయాణించాలంటే దుర్వాసన వస్తుందని గ్రామస్తులు చెప్తున్నారు. చెత్తలో ఉన్న ఆహార వ్యర్థాలను తినడం కోసం కుక్కలు అక్కడికి రావడంతో ఆ వ్యర్థాలన్నీ రోడ్డుమీద చల్లాచెదురుగా పడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ ఆ మార్గంలోనే ప్రయాణిస్తున్నప్పటికీ ఆ చెత్త సమస్య మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామంలో మెరుగైన పారిశుద్యం నిర్వహించి ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. చెరువులోనే చెత్తను వేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చెత్త వేయకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి చెత్తను తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వర్షం వస్తే నీళ్లన్నీ రోడ్డుపైనే..

ప్రజాశక్తి - పంగులూరు

అలవలపాడు గ్రామంలో కాలువల్లేని ప్రధాన రోడ్డు

మండలంలోని అలవలపాడు గ్రామంలోని ఇంకొల్లు - అద్దంకి ప్రధాన రోడ్డుకు మురుగు నీటి కాలువలు లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున సైడ్ కాలవలు లేకుండా నిర్మించారు. గతంలో మెటల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును మూడేళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డు విశాలంగా ఉన్నప్పటికీ సైడ్ కాలువలు నిర్మించలేదు. సైడ్ కాలువలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసిన రోడ్డంతా నీటితో నిండిపోతుంది. చెత్తా, చెదారం మొత్తం రోడ్డుపైనే ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు ఇళ్లల్లోకి కూడా వెళ్లే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు తమాది కాదని ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు అంటూ సైడ్ కాలవలు నిర్మించేందుకు ముందుకు రావటం లేదు. ఆర్ అండ్ బి అధికారులు కూడా దీని గురించి పట్టించుకోవడం లేదు. రెండు శాఖల అధికారులు పట్టించుకోక రోడ్డు అస్తవ్యస్తంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని సైడ్ కాలవలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మాల ఉద్యోగుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సుప్రీంకోర్టులో మాలలు వేసిన రివ్యూ పిటిషన్ తిరస్కరించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రకాశం జిల్లా మాల ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ బిగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు మాట్లాడుతూ దళితులకు రిజర్వేషన్ ఫలాల్ని దూరం చేయాలన్న దుర్బుద్ధితో, వర్గీకరణ ప్రవేశపెట్టి రాజ్యాంగం హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూరం చేయాలనుకుంటున్నారన్నారు. మాలల న్యాయమైన కోరికలను సుప్రీంకోర్టు తోచి పుచ్చటం సిగ్గుచేటన్నారు. దేశంలోని ఆంధ్ర, తెలంగాణ తప్ప అన్ని రాష్ట్రాలు వర్గీకరణ వ్యతిరేకిస్తున్న ప్పటికీ సుప్రీంకోర్టు తన వైఖరిని మార్చుకో పోవటం రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమేనని తెలిపారు. వర్గీకరణ, క్రిమిలేయర్ వ్యతిరేకంగా మాలలు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగులు జిల్లా అధ్యక్షుడు జి.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షులు కాటుకూరి బాబూరావు, శ్రీరాములు, కార్యనిర్వాహక కార్యదర్శి వై.జనార్ధన్, కోశాధికారి యరమాల మల్లికార్జునరావు, పాలడుగు వివేకానంద, మిట్నసల శాంతారావు, కార్యవర్గ సభ్యులు, మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అపార నష్టం

- నీట మునిగిన పత్తి
- నేల మట్టమైన మిరప పంట
- నష్టాల బాటలో రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షం కురిసింది. దీంతో వీరాయిపాలెం గ్రామంలో పత్తి పైర్లు నీట మునిగాయి. మిరప తోటలు నేలమట్ట మయ్యాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వీరాయిపాలెం గ్రామానికి చెందిన వల్లాల పెద్ద అంకాలు, నల్లబోతుల పెద్ద అంజయ్య,

నేలమట్టమైన మిర్చి పంట

వల్లాల వెంకటేశ్వర్లు, భవనం వెంకటేశ్వర్లు ఇలా సుమారు 20 మంది రైతులకు చెందిన 60 ఎకరాల్లోని పత్తి నీట మునిగింది. 50 ఎకరాల్లోని మిరప, 40 ఎకరాల్లోని పొగాకు పంటలు నేలమట్టమయ్యాయి. పందివానిపల్లి, యర్రగొండపాలెం గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి మరో వంద ఎకరాల్లో పత్తి, మిరప, పొగాకు పంటలు నేలమట్ట మాయ్యాయి. తీవ్రంగా నష్టం వాటిల్లింది. పత్తి పంట ఎకరా సాగు చేయడానికి ఇప్పటికే రూ. 50 వేల మేర పెట్టుబడి పెట్టినట్లు వల్లాల పెద్ద అంకాలు తెలిపారు. సేద్యం చేసి, ఎరువులు వేసి, బలం మందులు చల్లి, తెగుళ్ల సోకకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ చేసి పంటను కంటి రెప్పలా కాపాడుకున్నట్లు తెలిపారు. ఇప్పుడిప్పుడే పత్తిలో పూత, పిందె వస్తున్నట్లు తెలిపాడు. ఇంతలోనే పత్తి చేను నీట మునిగిందని వాపోయాడు. పూత, పిందె రాలిపోవడంతో పాటు ఉరకలెత్తి మొక్కలు చనిపోతాయని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను సాగు చేసిన నాలుగు ఎకరాల మిరప తోటలో వరద నీరు ప్రవహించి పైరంతా నేల మట్టమైనట్లు వీరాయి పాలేనికి చెందిన

పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

నల్లబోతుల పెద్ద అంజయ్య తెలిపారు. ఈ పాటికే ఎకరాకు రూ. 70 వేలు వరకు పెట్టుబడి పెట్టినట్లు ఆయన వాపోయాడు, పంట నష్టపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పొగాకు తోట నీట మునిగినట్లు అదే గ్రామానికి చెందిన భవనం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆకులన్ని కుళ్లి పోయి మొక్కలు చనిపోతాయని చెప్పారు. ఇప్పటికే ఎకరాకు రూ. 30 వేలు చొప్పున పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అకాల వర్షంతో రైతులకు అపార నష్టం మిగిల్చిందని వాపోతున్నారు. పంట నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. -

ఎమ్మెల్యే దామచర్లను కలిసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన కె.లక్ష్మి ప్రసన్న స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లా డుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కోవాలన్నారు. అధికారులతో సమన్వయంతో చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా జిల్లాకు బదిలీపై వచ్చిన మైనింగ్ ఉప సంచాలకులు బి.రాజశేఖర్ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావును మర్యాద కపూర్వంగా పుష్పగుచ్చం అందజేశారు.

ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న ఆర్‌డిఒ లక్ష్మి

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి- శింగరాయకొండ

ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని స్థానిక సిఐ హజరత్తయ్య కాపాడారు. ఈఘటన ఆదివారం శింగరాయకొండలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సిరిగిరి ప్రాంతానికి షేక్ షబ్బీర్ సుమారు 20 సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులతో కలిసి కందుకూరు లోని జనార్ధన కాలనీలో నివాసముంటున్నాడు. కందుకూరు పరిసర ప్రాంతాల్లో పాల్ సీలింగ్ చేస్తూ జీవనం సాగి స్తున్నాడు. హైదరాబాద్ చెందిన ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరు కలిసి 4 సంవత్సరాలుగా కందుకూరులో సహజీవనం చేస్తున్నారు. ఇటీవల ఆ యువతి షబ్బీర్‌తో గొడవపడి తన అమ్మ గారి ఇంటికి వెళ్లింది. ప్రేయసి వెళ్లిపోవడంతో షమీర్ మస్తాపానికి గురయ్యాడు. ఆత్మహత్య చేసేందుకు సాయంత్రం 5 గంటలకు కందుకూరు నుంచి బైకుపై శింగరాయకొండ వచ్చాడు. సోమరాజుపల్లి రైల్వే గేటు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించగా సిఐ హజరత్తయ్యకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో సిఐ హజరత్తయ్య, హోంగార్డు సురేష్ సోమరాజుపల్లి రైల్వే గేటు వద్దకు వెళ్లి షబ్బీరు అదుపులోకి తీసుకున్నారు. సిఐ కార్యాలయం వద్దకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం షబ్బీర్ అక్క, అన్నను పిలిచి వారికి అప్పగించినారు. యువకుడు ప్రాణాలు కాపాడిన సిఐ హజరత్తయ్య, హోంగార్డు సురేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

షబ్బీర్‌ను బంధువులకు అప్పగిస్తున్న సిఐ హజరత్తయ్య

రైతుల సంక్షేమమే ధ్యేయం

- ఈ క్రాప్‌లో 96.85 శాతం నమోదు
- రైతు ఖాతాలకు పిఎం కిసాన్ నిధులు జమ
- రబీ సీజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- విత్తనాల కోసం ప్రతిపాదనలు
- జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు

ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకునే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. 2024 ఖరీఫ్‌లో ఈకెవైసిలో 96.85 శాతం నమోదు చేశామన్నారు. 18వ విడత పిఎం కిసాన్ నిధులు రూ.48.94 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. రబీ సీజన్‌కు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగులు మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ఆయన ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ మాటల్లోనే...

వ్యవసాయ శాఖ ద్వారా రైతులను అన్ని విధాల ఆదుకునే లక్ష్యంతో ముందుకెళు తున్నాం, భూసార పరీక్షలు నిర్వహించి ఏయే సీజన్‌లో ఏ పంటలు వేయాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. సబ్సిడీ ధరలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాం. అవసరమైన వ్యవసాయ పని ముట్లు అందిస్తున్నాం. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం.

ఈ క్రాప్‌లో 96.85 శాతం నమోదు

2024 ఖరీఫ్‌లో ఈ క్రాప్ 96.85 శాతం నమోదు చేశాం. రైతు భరోసా కేంద్రాల పరిధిలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(విఎఎ)ల ద్వారా రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయించాం. జిల్లాలో 3,94,557 హెక్టార్లకు గాను 3,81,347 హెక్టార్లు నమోదు పూర్తయ్యింది. ఈనెల 7 వరకు ఈక్రాప్ నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఈ క్రాప్ నమోదు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

రైతు ఖాతాలకు పిఎం కిసాన్ నిధులు జమ

ప్రధాన మంత్రి కిసాన్ 18వ విడత నిధులను రైతుల ఖాతాలకు జమ చేశాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మహారాష్ట్ర వాసిమ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని మొత్తం 2,44,678 మంది రైతులకు రూ. 48.94 కోట్ల నిధులు విడుదల కాగా రైతు ఖాతాలకు వాటిని జమ చేశాం. దర్శి నియోజకవర్గంలో 37,764 మంది రైతులకు రూ. 7.55 కోట్లు, గిద్దలూరు నియోజకవర్గంలో 35,170 మంది రైతులకు రూ. 7.03 కోట్లు, కనిగిరి నియోజకవర్గంలో 38,407 మంది రైతులకు రూ. 7.68 కోట్లు, కొండపి నియోజకవర్గంలో 33,348 మంది రైతులకు రూ. 6.67 కోట్లు, మార్కాపురం నియోజకవర్గంలో 30,983 మంది రైతులకు రూ. 6.62 కోట్లు, ఒంగోలు నియోజకవర్గంలో 7,994 మంది రైతులకు రూ. 1.6 కోట్లు, సంతనూతలపాడు నియోజకవర్గంలో 26, 256 మంది రైతులకు రూ. 5.52 కోట్లు, యర్రగొండ పాలెం నియోజకవర్గంలో 34,762 మంది రైతులకు రూ. 6,95 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశాం.

రబీ సీజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

2024 రబీ సీజన్‌కు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రబీ సీజన్‌లో 1,49,500 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం. రబీలో ప్రధానంగా శనగ, పొగాకు, జొన్నలు, వరి, మినుములు, అలసందలను రైతులు సాగు చేస్తారు. శనగ 49,777 హెక్టార్లు, పొగాకు 27,298 హెక్టార్లు, వరి 21,669 హెక్టార్లు, మినుములు 25,607 హెక్టార్లు, అలసందలు 7,765 హెక్టార్లు సాగు విస్తీర్ణంగా లక్ష్యంగా నిర్ణయించాం. గత ఏడాది రబీలో పొగాకు 22,000 హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించగా రైతులు 32,000 హెక్టార్లల్లో పంటను సాగు చేశారు.

విత్తనాల కోసం ప్రతిపాదనలు

రబీ సీజన్‌లో శనగ, మినుములు విత్తనాల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. సీజన్ ప్రారంభమయ్యే నాటికి రైతులకు అందజేస్తాం. మిర్చి ఆరబెట్టటానికి 10,000 టార్పిలిన్స్ కోసం ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే వాటిని సబ్సిడీపై రైతులకు అందజేస్తాం.